క్లుప్తంగా

పాలిటెక్నిక్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు



నిజామాబాద్ రూరల్: ఎగ్జిబిషన్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో కొలువుదీరింది. నిజామాబాద్ ఇండస్ట్రియల్, అగ్రికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో 48 ఏళ్లుగా జిల్లా కేంద్రంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో జాయింట్ వీల్, కొలంబస్, ట్రైన్‌తో పాటు చిన్న పిల్లల కోసం రకరకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వస్త్రాల స్టాళ్లు, ఎగ్జిబిషన్ వచ్చే వారి కోసం హోటల్, తినుబండారాల స్టాళ్లు, ఐస్ క్రీమ్ పార్లర్లు, జ్యూస్ పార్లర్లు ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు కొనసాగుతుంది.

సన్మానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ నుంచి నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లుతున్న మహిళ పోలీస్ కానిస్టేబుళ్లు నజ్మా, జాఫరిన్, సారికలను రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం సన్మానించారు. రైల్వేలో పని చేసినట్లు మరో చోట పని చేసి పేరు తెచ్చుకోవాలని ఎస్సై సూచించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం



జక్రాన్‌పల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు

జక్రాన్‌పల్లి: మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. అంబానీ, అదానీ వ్యాపారవేత్తలకు దేశాన్ని అమ్మేస్తున్నారని అన్నారు. తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు ప్రభాకర్, రాజన్న, గంగాధర్, మోహన్, శంకర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

'బీడీ కార్మికుల సంక్షేమం కోసం రాపల్లి కృషి చేశారు'



శ్రమ శక్తి పురస్కారాన్ని అందుకుంటున్న రాపల్లి శ్రీనివాస్

నిజామాబాద్ రూరల్: బీడీ కార్మికుల సంక్షేమం కోసం రాపల్లి శ్రీనివాస్ తీవ్రంగా కృషి చేశారని కార్మిక ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం. దాన కిషోర్, కార్మిక శాఖ ఉన్నతాధికారులు అన్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో మే డే గురువారం రోజున మే డే శ్రమశక్తి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో నాలుగు సార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమం కోసం ఆయన పని చేశారన్నారు. లేబర్ రైట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులుగా శ్రీనివాస్ కేంద్ర రాష్ట్ర సంక్షేమ పథకాలపై కార్మిక విద్యా సంస్థ ద్వారా గతంలో అవగాహన సదస్సులు నిర్వహించారని గుర్తు చేశారు.

సెలవులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు మంజూరుచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని సీఐటీయూ నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోని సీఐటీయూ కార్యాలయంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నూర్జహన్, రమేష్‌బాబు మాట్లాడుతూ.. వేసవి సెలవుల దృష్ట్యా అంగన్వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు ఇవ్వాలని సీఐటీయూ చేసిన ఆందోళనలను గుర్తించిన ప్రభుత్వం సెలవులు ప్రకటించడం అభినందనీయమన్నారు. నాయకులు స్వర్ణ, వాణి, సునీత, జరీనా, సందీప, సరిత, లలిత, అనీష్, సరస్వతి,స్రవంతి, స్వాతి పాల్గొన్నారు.

మురికికూపంగా 'స్లాటర్‌హౌజ్'

- నిత్యం వందల సంఖ్యలో పశువుల వధ
- మౌలిక వసతులు కరువు
- దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని బల్దియా అధికారులు



నాగారంలోని స్లాటర్ హౌజ్

నిజామాబాద్ సిటీ: నగర శివారు ప్రాంతం నాగారంలోని స్లాటర్ హౌజ్‌లో వసతులలేమి కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అక్కడ ప్రతిరోజూ వందల సంఖ్యలో పశువుల వధ జరుగుతుంది. ఇందుకుగాను టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తారు. దీనిలో పాల్గొని అత్యధిక వేలం పాడినవారికి స్లాటర్‌హౌస్ అప్పగిస్తారు. ప్రతి సంవత్సరం టెండర్లలో 10 శాతం పెంచుతున్నారు. మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్కడికి వెళ్లినవారు ముక్కు మూసుకోవాల్సిందే. కొన్ని నిముషాలు కూడా ఉండలేరు. అటువంటి చోట గంటల తరబడి పనులు చేస్తున్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాంసం విక్రయించేవారు నాగారంలోని బాబన్‌సాహిపహడ్‌లోని స్లాటర్ హౌజ్(జంతువధశాల)లో పశువులను వధించాలి. అక్కడికి తీసుకెళితే అక్కడి నిర్వాహకులు పశువులను వధించి, వ్యర్థాలు తొలగించి మాంసం తిరిగి ఇస్తారు. ఇందుకుగాను ఒక్కో పశువుకు రూ.35 మాత్రమే వసూలు చేస్తారు. ప్రతీరోజు 100 నుంచి 150 వరకు పశువులను వధిస్తారు.



పశువులను వధించి మాంసం తీస్తున్న దృశ్యం ,



నల్లాల వద్ద పేరుపోయిన పాచి

టెండర్ల ప్రక్రియ ద్వారా..

స్లాటర్‌హౌజ్‌కు ప్రతీ సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో టెండర్లు ఆహ్వానిస్తారు. అత్యధిక బిడ్ పలికినవారికి సంవత్సరం పాటు కాంట్రాక్టు ఇస్తారు. దాదాపు ప్రతీసారి ఒక్కరే ఈ కాంట్రాక్టు దక్కించుకుంటున్నారు. ఈ సారి టెండర్‌లో రూ.25 లక్షల 66 వేలకు మహ్మద్ ఇమ్రాన్ ఖురేషీ అనే వ్యక్తి దక్కించుకున్నారు. కొన్నేళ్లుగా వీరికి సంబంధించినవారే కాంట్రాక్టులు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ముందుకురాని కాంట్రాక్టర్లు..

స్లాటర్‌హౌజ్‌లో మౌలిక వసతులు, తాత్కాలిక నిర్మాణాల కోసం బల్దియా అధికారులు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సరిపడా నిధులు కేటాయించకపోవడంతో పనులు చేసేందుకు శ్రద్ధ చూపడం లేదు. దాంతో కొన్నేళ్లుగా జంతువధశాల అధ్వానంగా తయారైంది. ప్రతేడాది 10 శాతం ఫీజు పెంచుతున్నా వసతులు కల్పించడంలో మాత్రం పట్టించుకోవడం లేదు.

అధ్వానంగా ఉంది



స్లాటర్‌హౌజ్ అధ్వానంగా తయారైంది. 20 ఏళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధి లేదు. లైట్లు లేవు. చీకట్లోనే వధిస్తున్నారు. మాంసం శుభ్రం చేసేందుకు సరిపడా నల్లాలు లేవు. శుభ్రమైన నీరు లేవు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– నదీమ్ అహ్మద్, స్థానికుడు

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



ప్రతి సంవత్సరం ఫీజులో 10 శాతం పెంచుతున్న అధికారులు వసతులు మాత్రం కల్పించడం లేదు. టెండర్లు అయిన తర్వాత అధికారులు ఇటువైపు మొఖం చూపరు. పనులు చేస్తామని తప్పుడు హామీలు ఇస్తారు తప్ప పనులు చేయడం లేదు.

– మహ్మద్ ఇమ్రాన్ ఖురేషి

టెండర్లు పిలిచాం



స్లాటర్‌హౌజ్ మరమ్మతుల కోసం టెండర్లు పిలిచాం. ప్రక్రియ సాగుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకే పనులు చేయగలం. మౌలిక సదుపాయాలు తప్పకుండా మెరుగుపరుస్తాం.

– దిలీప్ కుమార్, బల్దియా కమిషనర్

ఎండాకాలం ఓల్టేజీ ఎక్కువ తక్కువ కాకుండా..



ఎర్తింగ్ కోసం నీటిని నింపుతున్న మున్సిపల్ సిబ్బంది

నగరంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న హెచ్‌పీ సర్వీస్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఎర్తింగ్‌లలో వాటర్ ట్యాంక్ ద్వారా నీరు పోస్తున్నారు. ఎండాకాలంలో ఎర్తింగ్‌లో నీరు పోయడం వల్ల హెచ్‌పీ సర్వీస్ ట్రాన్స్‌ఫార్మర్ కింద చల్లగా ఉంటుందని.. దీంతో వోల్టేజీ ఎక్కువ తక్కువ కాకుండా పనిచేస్తుందని, రోజుకు రెండుసార్లు ఎర్తింగ్‌లలో వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని పోస్తున్నామని మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

నిజామాబాద్ రూరల్: మల్లారం గ్రామంలో శ్రీగురు రాఘవేంద్ర సన్‌రైస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్, డయాబెటీస్ పరీక్షలు నిర్వహించారు. దీంతో పాటు ఆర్థోపెడిక్, న్యూరో పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ ప్రణయ్, శిబిరం నిర్వాహకులు పి.శ్రీనివాస్, శశికళ, దీపిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటకెక్కిన చెత్త శుద్ధి

- నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు
- గ్రామాలకు దూరంగా నిర్మాణం
- నిర్వహణపై దృష్టి సారించని అధికారులు



ధర్పల్లి మండలం వాడీలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

ధర్పల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం జిల్లాలో ప్రతి పంచాయతీ పరిధిలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడంతో కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా రోజూ నివాస ప్రాంతాల నుంచి చెత్తను సేకరించి కంపోస్టు ఎరువుగా మార్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని సదుద్దేశంతో కంపోస్ట్ షెడ్‌లను పంచాయతీల్లో ఏర్పాటు చేసింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు ప్రస్తుతం వృథాగా పడి ఉన్నాయి.

కంపోస్టు షెడ్ల లక్ష్యం

ఒక్క కంపోస్టు షెడ్ నిర్మాణానికి రూ.2.5 లక్షలు ఖర్చు చేశారు. కానీ గ్రామ పంచాయతీలు ఈ షెడ్లను ఉపయోగించడం లేదు. ఇళ్ల నుంచి సేకరించిన ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ బాటిల్లు తదితర వ్యర్థాలను వేరుచేసి ఎరువుగా మారే పదార్థాలను కంపోస్టు గుంతల్లో వేస్తారు. సేంద్రియ ఎరువుగా మారిన అనంతరం గ్రామపంచాయతీల పరిధిలో హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీలతో పాటు రైతులకు అందించాలని నిర్దేశించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, గాజు సీసాలు, ఇతర వస్తువులను విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయని లక్ష్యంగా ప్రారంభించిన పథకం కొన్నిచోట్ల అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేకపోతున్నాయి.

కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యం

గ్రామాలలో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడవేయడం ద్వారా వాటిలోని రసాయనిక పదార్థాలు భూమిలోకి చేరి తద్వారా నేల, నీరు కలుషితం అవుతుంది. చెత్త కుళ్లిపోయి దుర్గంధం, కాల్చడం వల్ల వెలువడిన పొగతో పర్యావరణం దెబ్బతింటోంది. పల్లెల్లో కాలుష్యాన్ని నివారించి పర్యావరణహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామ పంచాయతీల్లో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామాల్లోని వ్యర్థ పదార్థాలను తరలించి వాటితో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అందించాలని నిర్ణయించారు. తద్వారా భూసారాన్ని రక్షించాలనే ప్రణాళికతో రూపొందించిన పథకం అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తయారు కాని ఎరువు

నిజామాబాద్ జిల్లాలో (కొత్తగా ఏర్పడిన 15 జీపీలు కాకుండా)530 గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు నీళ్ల ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరువేరుగా అందించేందుకు గతంలో ఇంటింటికి బుట్టలు పంపిణీ చేశారు. కానీ చాలామంది తడి, పొడి చెత్తను వేరు చేయకుండా ఇష్టానుసారంగా అందిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని వేరుచేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువులు గ్రామపంచాయతీ విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే వీటి ఉద్దేశం. కానీ గ్రామాలలో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు కనపడటం లేదు. చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం



అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎల్ఎంఎస్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఏర్పాటుచేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిలో ఎండ వేడిమి దృష్ట్యా ప్రజల ఉపశమనం కోసం 11 ఏళ్లుగా ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని, మూడేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వేసవి ముగిసే వరకూ ఉచిత అంబలి పంపిణీ కేంద్రం కొనసాగుతుందని, నిర్వహణ బాధ్యతలు తీసుకుంటున్న పార్శి రమేష్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా సమాజ సేవలో పాలుపంచుకోవాలని సూచించారు. నాయకులు, నగర ప్రముఖులు దిగంబర్ పవార్, పున్నయ్య, సదాశివ, రామస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు తారక్ వేణు, శీల శ్రీనివాస్, బైకన్ మధు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, నాయకులు

సుభాష్‌నగర్: నగరంలోని కంఠేశ్వర్ సార్వజనిక్ శ్మశానవాటిక ప్రహరీ, వెయిటింగ్ హాల్ నిర్మాణానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. సార్వజనిక్ శ్మశానవాటిక అభివృద్ధికి 14వ ఆర్థిక సంఘం ద్వారా రూ.27లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఆ నిధులతో ప్రహరీ, వెయిటింగ్ హాల్ నిర్మాణం చేపడుతున్నామని, పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. శ్మశానవాటిక అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని అన్ని సార్వజనిక్ శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపడుతామని హామీనిచ్చారు. మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాగోళ్ల రవి, చంద్రమౌళి, ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్వర్, గుండు రవి, సాయి ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



జయంతి కార్యక్రమంలో బ్రాహ్మణ ప్రతినిధులు



వాసవీ మాత ఆలయంలో పూజలు

నిజామాబాద్ రూరల్: హైందవ సంస్కృతి పరిరక్షణకు అవతరించిన జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను జిల్లా బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ రోడ్డు గీత భవనం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకులు యుగంధర్ మాట్లాడుతూ.. అతి చిన్న వయస్సులోనే వేద వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన అభినవ బ్రహ్మ శంకరాచార్యులని కొనియాడారు. ఎన్నో స్తోత్రాలకు భాష్యాలు రాశారని, భజ గోవిందం, కనకధార స్తోత్రము రచించి ప్రజల్లో భక్తి వికాసం పెంపొందించడానికి కృషి చేశారన్నారు. నమక చమక పంచసూక్త పారాయణం చేశారు. పలు పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.చంద్రశేఖర శర్మ, రొట్టె సురేష్, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆలయంలో..

నిజామాబాద్ రూరల్: గతి తప్పిన భారత దేశాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి సాక్షాత్తూ పరమేశ్వరుడు మానవుడిగా అవతరించిన రూపమే ఆది శంకరాచార్యుల వారని ప్రముఖ పండితులు వేలేటి గౌరీ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని వాసవీ మాత ఆలయంలో సాయంత్రం ఆది శంకరాచార్య జయంతి ఘనంగా నిర్వహించారు. స్వామి వారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రముఖ పండితులు వేలేటి గౌరీ శంకర శర్మ అన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

ఎడపల్లి(బోధన్): పరిమితికి మించి మద్యం తాగి వాహనాన్ని నడిపిన ఏఆర్‌పీ క్యాంప్‌నకు చెందిన ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ బోధన్ మేజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పును ఇచ్చారు. అదే విధంగా ఎడపల్లి అంగన్‌వాడి సెంటర్‌లో ధూమపానం చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం ఉదయం స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా సోషల్ సర్వీస్ కోర్టు ఆవరణలో ఉన్న చెట్లకి నీళ్లు పోయాలని తీర్పు వెల్లడించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

నియామకం

రుద్రూర్: పోతంగల్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కల్లూరి హన్మాండ్లు అలియాస్ బజరంగ్ హన్మండ్లును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. పార్టీపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని, మండలంలో పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2 థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-11.00, 4.40
రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3 రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30
థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2 రెట్రో-10.10, 4.25, 10.40
థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3 రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50
రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4 తుడరుమ్-10.15, 1.35
సారంగపాణి జాతకం-4.55
రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45
లలితామహల్ రెట్రో దేవి థండర్ బోల్ట్స్ 2డీ
నటరాజ్ రైడ్-2(హిందీ) విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,700	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,260		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	8	16
కాకరకాయ	35	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పాల్గొన్న భక్తులు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- ఘనంగా ప్రారంభమైన త్రయోదశ వార్షికోత్సవం

డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీదేవీ శ్రీభూదేవీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలోని సత్యనారాయణ స్వామి, విజయగణపతి–నవగ్రహములు, ఉమామహేశ్వరస్వామి, అభయ ఆంజనేయస్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, సంతాన నాగేంద్ర స్వామి దేవాలయాల త్రయోదశ (13వ) వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం విజయగణపతి, అభయాంజనేయస్వామి, నవగ్రహ అభిషేకాలు, శ్రీఉమా మహేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, అన్నపూజ కార్యక్రమాలను బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ, దేవాలయ ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శంకర జయంతి, అనంతరం శ్రీ శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు రావుల బ్రహ్మానందం తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నాయుడు అంజనేయులు, జంపాని శ్రీనివాస్, కొనకంచి సుబ్బారావు, సుధాకర్, నాగేశ్వరరావు (బుజ్జి), పాల్గొన్నారు.